ప్రజాశక్తి

సోమవారం 2 అక్టోబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

'గుండ్లకమ్మ' గేట్లకు

మరమ్మతులు చేపట్టడంలో ప్రభుత్వం విఫలం



పాదయాత్రలో పాల్గొన్న రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు, రైతులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనట్లు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.కష్ణయ్య విమర్శించారు. ప్రాజెక్టు గేట్లు దెబ్బతిని 15 నెలలు దాటిని నేటికీ మరమ్మతులు పూర్తి చేయక పోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గుండకమ్మ ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేపట్టాలని, కాలువల్లో పూడిక తొలగించాలని కోరుతూ రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు నుంచి గుండ్లకమ్మ జలాశయం వరకు ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. తొలుత పాదయాత్రను ఆచార్యరంగా కిసాన్ సంస్థ కన్వీనరు చుంచు శేషయ్య ప్రారంభించారు ఈసందర్భంగా కష్ణయ్య మాట్లాడుతూ ఇరిగేషన్‌కు బడ్జెట్‌లో రూ.11వేలకోట్లు కేటాయించినట్లు తెలిపారు. అందులో కేవలం రూ. 3,400 కోట్లు మాత్రమే ఖర్చు చేసారన్నారు. అందులో కనీసం కోటి రూపా యలు కేటాయించి గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయించలేదని దౌర్భాగ్య స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఎద్దేవ చేశారు. ప్రాజెక్టు సమస్యలను మంత్రుల దష్టికి తీసుకెళ్లినప్పటికీ వారికి చీమకుట్టినట్లు కూడా లేదని దుయ్యబట్టారు. ప్రాజెక్టుగేట్లు మరమ్మతులకు గురికావడంతో సుమారు 80 వేల ఎకరాలల్లో సాగు ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. ఈపాటికే ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఘన నీయంగా తగ్గిందన్నారు. కనీసం ఆరుతడులకు నీరువస్తుందో లేదోనని రైతులు ఆందోళన ఉన్నారని తెలిపారు. అందులో భాగంగా ఖరీఫ్‌లో మిర్చి, మాగాణి పంటల సాగు పట్ల ఆసక్తి చూపడం లేదన్నారు. పంటలు దెబ్బతినడంతో అప్పుల పాలై రైతులు కూలీ పనులు వెళ్తున్నట్లు తెలిపారు. రైతుల సాగు నీటి కోసం రాజకీయాలకు అతీతంగా పోరాడాల్సి అవసర ముందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు, కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి రబీలో సాగు నీరు అందిస్తామని రైతులకు భరోసా కల్పించాలన్నారు. లేకుంటే సాగునీరు అందించే వరకూ పోరాటం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం పాదయాత్ర నాగులుప్పలపాడు నుంచి పోతవరం, నిడమానూరు, గ్రోత్ సెంటరు మీదుగా గుండ్లకమ్మ జలాశయం వరకూ సాగింది ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.మాబు, వి. బాలకోటయ్య, ఉపాధ్యక్షుడు టి. శ్రీకాంత్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, ఉపాధ్యక్షుడు జె. జయంతిబాబు, చుండూరి రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జాలా అంజయ్య , వివిధ ▶ 2లో



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- పారిశుధ్య కార్మికులకు అండగా ప్రభుత్వం
- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



శ్రమ దానంలో మంత్రి సురేష్

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రతి ఒక్కరూ తమ నివాస ప్రాంతాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సూచించారు. మార్కాపురం మున్సిపాలిటీలోని అమ్మవారిశాల బజారులో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా 'ఏక్ తారీక్ ఏక్ గంట' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సురేష్, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతాహి సేవ డైరెక్టర్ గంధం చంద్రుడు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, పారిశుధ్య కార్మికులతో కలిసి మంత్రి డాక్టర్ సురేష్, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ శ్రమదానం చేశారు. రోడ్లను శు భ్రం వీధుల్లోని చెత్తను ఎత్తేశారు. అనంతరం షాప్‌ల నిర్వాహకులతో మంత్రి సురేష్ మాట్లాడుతూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా... చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకొని పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు వారికి అందజేయాలని తెలిపారు. షాపుల వద్ద పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 'స్వచ్ఛతహి సేవ' అవగాహనలో భాగంగా అమ్మవారిశాల నుంచి నాయుడు బజార్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి సురేష్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని కొనియాడారు. కరోనా మహమ్మారితో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలోనూ కార్మికులు సేవలను అందించారని గుర్తు చేశారు. గతంలో పారిశుద్ధ్య కార్మికుల రూ. 6, 000 జీతాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రూ. 18 వేలకు పెంచినట్లు తెలిపారు. ప్రస్తుతం మరో రూ. 3000 పెంచి రూ. 21 వేలు అందిస్తుందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన పనిముట్లు, ఇతర సామాగ్రిని అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. కార్మికులు అప్పట్లో ప్రజలు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని తెలిపారు. స్వచ్ఛత హి సేవ ప్రతిజ్ఞను చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కూరగాయలు, పండ్లు, బియ్యాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకష్ణ, మెప్మా, డిఆర్‌డిఎ పీడీ రవికుమార్, తహశీల్దారు షేక్ పర్వీన్, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, మున్సిపల్ డిఇ షేక్ సుభాని, ఎఇ పి.ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్, కౌన్సిలర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో...

స్థానిక డాక్టర్ శ్యామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో గాంధీ జయంతిని పురస్కరించుకుని కళాశాల ఎన్‌ఎస్–ఎస్/ఎన్‌సిసి యూనిట్‌ల ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులకు

కలిసిరాని 'గడప గడపకూ'

- టిక్కెట్లపై రాని స్పష్టత
- అధిష్టానం వద్ద సర్వేలు
- సిట్టింగ్ ఎమ్మెల్యేపై వ్యతిరేకత



గడప గడపకూలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి(ఫైల్)

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ దక్కించుకోవాలంటే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అమలులో ఉత్తీర్ణులు కావాలని ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదిన్నర కాలం క్రితం స్పష్టం చేశారు. అందులో భాగంగా గతేడాది మే 11న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో పార్టీ టిక్కెట్ ఆశిస్తున్న అభ్యర్థులు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. గత డిసెంబరులో నిర్వహించిన 4వ సమీక్ష అనంతరం రాష్టస్థాయిలో గడప గడప కార్యక్రమం అమలులో పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జి రావి రామనాథం బాబు ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన్ని ఇన్‌ఛార్జి పదవి నుంచి తప్పించి చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను ఇన్‌ఛార్జీగా నియమించారు. దీంతో గడప గడపకూ తిరిగినా పార్టీ టిక్కెట్ రాని వైసిపి అర్ధమయ్యింది.గడపగడపకూ కార్యక్రమం పూర్తయిన సచివాలయానికి రూ. 20 లక్షల చొప్పులు అభివృద్ధి పనుల కోసం రాష్ట ప్రభుత్వం మంజూరు చేస్తుండగా ఆ నిధులు తమ నియోజకవర్గానికి ఉపయోగకరంగా ఉంటాయని భావించిన నేతలు గపడ గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

గడప గడకూ తిరిగినా గ్యారంటీ లేని టిక్కెట్

బాపట్ల జిల్లాలోని వేమూరు, బాపట్ల నియోజకవర్గాల్లో మాత్రమే వైసిపి ఎమ్మెల్యేలు ఉన్నారు. చీరాల నుంచి టిడిపి తరపున గెలుపొందిన కరణం బలరామ కృష్ణమూర్తి వైసిపికి మద్దతు తెలిపారు. దీంతో ఆయన కుమారుడు కరణం వెంకటేష్ పార్టీ ఇన్‌ఛార్జిగా నియమించారు. దీంతో కరణం వెంకటేష్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రేపల్లె, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో టిడిపి ఎమ్మెల్యేలు ఉన్నారు. వేమూరులో వైసిపి ఎమ్మెల్యే, మంత్రి మేరుగ నాగార్జున, బాపట్లలో ఎమ్మెల్యే కోన రఘపతి, రేపల్లెలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ గడప గడపకూ ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పర్చూరులో గత డిసెంబరు వరకూ ఇన్‌ఛార్జీగా ఉన్న రావి రామనాథం బాబు మొత్తం 181 రోజులు గడప గడకూ కార్యక్రమం ద్వారా 54,400 గృహాలు సందర్శించారు. ఈ ఏడాది జనవరి నుంచి పర్చూరు ఇన్‌ఛార్జిగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్ గడప గడకూ కార్యక్రమం గురించి పట్టించుకోలేదు. అయినప్పటకీ ఆయన 20 వేల గృహాలను సందర్శించినట్లు లెక్కలు చెబుతున్నాయి. గడప గపకూ తిరగకుండానే ఆన్‌లైన్‌లో తిరిగినట్లు నమోదు చేశారని ఈ విషయమై అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. అద్దంకి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రావి రామనాథం బాబు గడప గడకూ కార్యక్రమంలో రాష్టంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన్ను ▶ 2లో



పాదయాత్ర నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

'గుండ్లకమ్మ' గేట్లకు మరమ్మతులు చేపట్టడంలో ప్రభుత్వం విఫలం

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల రైతులు, కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భరోసా కల్పించాలి

మద్దిపాడు : గుండ్లకమ్మ ప్రాజెక్టు మరమ్మతులు తర్విత గతిన పూర్తి చేసి రైతులకు పంటలకు నీరు అందిస్తామనే ధైర్యాన్ని కల్పించాలని, లేక పోతే స్థానిక స్థానిక ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు ఇంటిని ముట్టడిస్తామని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య హెచ్చరించారు. ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు నుంచి మల్లవరం గుండ్లకమ్మ ప్రాజెక్టు వరకూ ఆదివారం పాదయాత్ర చేపట్టారు. బూరేపల్లి కాలనీ వద్ద స్థానికులు పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ నుంచి గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్దకు పాదయాత్ర చేరింది. అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. సభలో వి.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్‌కు బడ్జెట్‌లో రూ.11 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గతేడాది రూ.9 వేల కోట్లు కేటాయించగా అందులో సగం మాత్రమే ఖర్చు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులకు ఒకదానికి కూడా మరమ్మతులు చేపట్టలేదన్నారు. అంబటి రాంబాబు అసెంబ్లీలో ఇరగదీస్తాడని, తన శాఖకు సంబంధించిన విషయాలపై కనీసం నోరు మెదపరని మండిపడ్డారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టకపోయి ఏడాది దాటుతున్న అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు సాగర్ నుంచి 5 టిఎంసిల అదనపు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు కింద 80 వేల ఎకరాలు పంట సాగవుతున్నట్లు తెలిపారు. రైతులు మిర్చి పంట సాగు చేసేందుకు వారికి ధైర్యాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, ఆల్ ఇండియా కిసాన్ కో ఆర్డినేషన్ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఆచార్య రంగ కిసాన్ సంస్థ జిల్లా కార్యదర్శి చుంచు శేషయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల కోటయ్య, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. మాబు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జయంత్‌బాబు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, సిఐటియు మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు, నాగులుప్పలపాడు రైతు సంఘం నాయకులు చిలుకూరు వెంకటరావు, మారెళ్ల అనిల్, చెంచయ్య, వెంకటసుబ్బయ్య, జి.బసవపున్నయ్య, జె.హరిబాబు, ఒ.సుబ్బారావు, బి.హనుమంతురావు, ఎ.వెంకటేశ్వర్లు, దాసరి ఆంజనేయులు, సి.నాగేశ్వరరావు, చెన్నారెడ్డి శ్రీను, 250 మంది రైతులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

4న సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పిసిపల్లి

అమలు కాని పెండింగ్‌లో ఉన్న సమస్యలపై పిజెసిఎ పిలుపు మేరకు ఈ నెల 4వ తేదీన ఒక్కరోజు సమ్మె విజయవంతం చేయాలని ఎఐజిడిఎస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కెబి మీరావలి పిలుపునిచ్చారు. జిడిఎస్‌లకు 8గంటలు పని కల్పించి సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, 12, 24, 36 సంవత్సరాల సీనియారిటీ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ 5లక్షలు చేయాలనే ప్రధాన డిమాండ్లతో జరిగే ఈ సమ్మెను ప్రతి గ్రామీణ తపాలా ఉద్యోగి పాల్గొని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల్లో సోదర భావం పెంపొందించాలి

జెవివి ఆధ్వర్యంలో దేశభక్తి వారోత్సవాలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశంలోని ప్రజలు ముఖ్యంగా విద్యార్థుల మధ్య సోదర భావం పెంపొందించి మత, కుల రహిత సమాజం నిర్మించాలని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక బండ్లమిట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో దేశభక్తి వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఒంగోలు నగర అధ్యక్షులు రంగారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల మధ్య సోదర భావాన్ని, దేశభక్తిని పెంపొందించాలని సూచించారు. ఒంగోలు నగర పరిధిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విద్యార్థులకు వివరించి వాటిని వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. ప్రజలు ఎలాంటి మతవిద్వేషాలకు వెళ్లకుండా ప్రతి పౌరుడు తన బాధ్యత నిర్వర్తించడం దేశభక్తి అని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జన విజ్ఞాన వేదిక జిల్లా సీనియర్ నాయకులు ఏవి పుల్లారావు మాట్లాడుతూ నేడు సమాజంలో దేశభక్తి పేర జరుగుతున్న విద్వేషాలు, మతకల్లోలాలను వివరించి వాటిని అందరూ వ్యతిరేకించాలని కోరారు. జన విజ్ఞాన వేదిక ప్రజల్లో విద్య ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను చేస్తోందని, ఇటీవల మరణించిన వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ గొప్పతనాన్ని వివరించారు. దేశభక్తి అంటే గురజాడ చెప్పిన విధంగా పరులకు సహాయం చేయటమని అన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఉంగరాల భాస్కర్ మాట్లాడుతూ జెవివి విద్యార్థులలో సామాజిక అంశాలపై ఆసక్తిని పెంపొందిస్తుందని సైన్స్ విషయాలను తెలియచేసేందుకు చెకుముకి మాసపత్రికను ప్రచురిస్తోందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి తిరుపతయ్య విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచన విధానాన్ని ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. అనంతరం దేశభక్తి వారోత్సవాల్లో భాగంగా ఒంగోలు నగర స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, పాటలు, నృత్యం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరందరిలో నగర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీ సూర్య విద్యానికేతన్, బండ్లమిట్ట గర్ల్స్ హైస్కూల్, మాంటిసోరి విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు సాధించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర కోశాధికారి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కార్యదర్శి ఎస్ శ్రీనివాస్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీ దుర్గ, అంజలి, విద్యార్థుల తల్లిదండ్రులు, జన విజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.



జెవివి సమావేశంలో మాట్లాడుతున్న ఒంగోలు నగర కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు

వినియోగదారుల రక్షణ సమితి కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి వినియోగదారుల రక్షణ సమితి నూతన కార్యవర్గాన్ని సమితి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వినియోగదారుల రక్షణ సమితి నూతన కార్యవర్గ ఎన్నిక సందర్భంగా ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమితి అధ్యక్షులు ధర్నాసి రామారావు (ప్రభుత్వ న్యాయవాది) ఆధ్వర్యంలో సమావేశంలో సమితి సభ్యులు సంయుక్తంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ మేరకు వినియోగదారుల రక్షణ సమితి నూతన కార్యవర్గ సభ్యులుగా 12 మందిని ఎన్నుకోగా వారిలో ఒక మహిళా ప్రతినిధితో పాటు 8 మందిని గౌరవ సలహాదారులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా ధర్నాసి రామారావు, ఉపాధ్యక్షులుగా జెఎస్ జహంగీర్ బాషా, నందిగామ అపర్ణ, ప్రధాన కార్యదర్శిగా జిబి షా, జాయింట్ సెక్రటరీగా మేడా నరసింహారావు, డిప్యూటీ సెక్రటరీగా ఓడి షకీలా (ఫిజికల్ డైరెక్టర్), కోశాధికారిగా పి నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భూమా రాంబాబు, పిఆర్వోలుగా మేడా చిన్న సుబ్బారావు, సామంతపూడి పరమేశ్వరరావు(జర్నలిస్ట్), షేక్ బాజీ కరిముల్లా (జర్నలిస్ట్), లీగల్ అడ్వైజర్‌గా జెవి సుబ్బారావు, మహిళా ప్రతినిధిగా ఎం అనూరాధలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా గౌరవ సలహాదారులుగా కె యలమందారెడ్డి, ఎం చెంచు సుబ్బారావు, ఎస్‌కె మదార్‌వలి, ఎం జానీ బేగ్, బి రామకృష్ణశర్మ (రిటైర్డ్ డిటి), ఎస్‌కే హుస్సేన్ పాశ్చా, ధర్నాసి పెద్దన్న, బాదం వెంకటేశ్వరరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సమితి నూతన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను, సీనియర్ సభ్యులను సమితి సభ్యులు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమితి నూతన అధ్యక్షుడు, నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు నూతన సభ్యులుగా సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులకు కలిసిరాని 'గడప గడపకూ'

(మొదటిపేజీ తరువాయి)

ఇన్‌ఛార్జి పదవి నుంచి తప్పించి ఇంటికి పంపారు. అనంతరం కాపు సామాజిక వర్గానికి చెందిన చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం అమలు విషయంలో పార్టీ అధినేత జగన్ సీరియస్‌గా ఉన్నందున రికార్డుల ప్రకారం చూస్తే తక్కువ కాలంలోనే ఎక్కువ గడపలు తిరిగినట్లు చూపారు. పార్టీ నిర్వహించిన సర్వేల్లో అక్కడ ఆమంచికి అనుకూల పరిస్థితులు లేవని తెలిసినట్లు సమాచారం. దీంతో ఆమంచిని కూడా తప్పించి మరో కొత్త కాపును తెచ్చేందుకు వైసిపి అధిష్టానం కసరత్తు జరుపుతున్నట్లు చెబుతున్నారు. అద్దంకి నియోజకవర్గం ఇన్‌ఛార్జీ బాచిన కృష్ణ చైతన్య నియోజకవర్గంలో 99 వేల గృహాలు ఉండగా 69 వేల గృహాలను సందర్శించారు. రాజకీయ సమీకరణాలు,పార్టీలో నెలకొన్న అంతర్గత పోరు కారణంగా కృష్ణచైతన్యను ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పించి బయట నుంచి మరొక నేతలు ఇక్కడికి తెస్తున్నట్లు తెలుస్తోంది. బాపట్ల జిల్లాలో నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రథమ స్థానంలో ఉన్నారు. ఎమ్మెల్యే కోన తన నియోజకవర్గంలో దాదాపు మొత్తం గృహాలను సందర్శించారు. అయినప్పటికీ ఆయన టిక్కెట్ విషయంలో విషమ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇక్కడ రెడ్డి సామాజికవర్గం నుంచి పలువురు పోటీకి వస్తున్నారు. గడప గడపకూలో వేమూరు ఎమ్మెల్యే, మంత్రి మేరుగ నాగార్జున ద్వితీయ స్థానంలో ఉన్నారు. ఆయన నియోజక వర్గంలో 84 వేల గృహాలకు గాను 76 వేల గృహాలను సందర్శించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ రానున్న ఎన్నికల్లో మేరుగ నాగార్జున స్థానం మారుతుందని చెబుతున్నారు. రేపల్లె నియోజకవర్గంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ ఇన్‌ఛార్జీగా ఉన్నారు. ఆయన గడప గడప కార్యక్రమంలో తిరుగుతున్నారు. నియోజకవర్గంలో 93 వేల గృహాలకు గానూ 64 వేల గృహాల సందర్శించారు. ఇక్కడ మోపిదేవి లేదా ఆయన కుమారుడు పోటీ చేస్తారని తెలుస్తుంది. ఇన్‌ఛార్జీగా ఉన్న కరణం వెంకటేష్ 80 వేల గృహాలకు గాను 43 వేల గృహాల సంర్శించారు. తక్కువ గృహాలను సందర్శించినప్పటికీ ఆయనకే పార్టీ టిక్కెట్ దక్కే అవకాశం ఉంది.

మున్సిపల్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి: సిఐటియు

ప్రజాశక్తి-పొదిలి: పొదిలిలో పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్‌తో కలిపి పూర్తి వేతనం చెల్లించాలని కోరుతూ అక్టోబర్ 2 నుంచి జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ కోరారు. పొదిలిలో సిఐటియు ఆఫీసులో కె సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం సిఐటియు ఆఫీసు నుంచి సబ్ స్టేషన్ రోడ్, కర్నూల్ రోడ్, కలశం టీ సెంటర్ మీదుగా కాలేజీ రోడ్ వరకు ప్రదర్శన జరిగింది. కాలేజీరోడ్ సెంటరులో రమేష్ మాట్లాడుతూ పొదిలి నగర పంచాయతీగా మారి 33 నెలలు పూర్తి అయినా నేటికీ హెల్త్ అలవెన్స్‌తో కలిపి పూర్తి జీతం చెల్లించటంలేదన్నారు. ఈ కాలంలో అనేక పర్యాయాలు పొదిలి నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ నెల 15న సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని సమ్మె నోటీసు ఇచ్చామని, సెప్టెంబర్ 20న పొదిలిలో జరిగిన స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. స్పందనలో 25వ తేదీకి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదని అన్నారు. ఈ ప్రదర్శనలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పొదిలి నగర పంచాయతీ కార్మికులు డి సుబ్బయ్య, కెవి నరసింహం, బి కోటేశ్వరావు, రాజయ్య, కె కిరణ్, సిహెచ్ వెంకటేశ్వర్లు, చిదర్ల రామయ్య, బి హజరత్తమ్మ, పి సుబ్బులు, పి కోటేశ్వరమ్మ, ఎం శాంతమ్మ, డి పోలేరమ్మ, బి విజయమ్మ, వైస్వరూప పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'యాప్ సోపాలు'

- యాప్‌ల్లో తరచూ ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న అంగన్‌వాడీలు
- సాంకేతిక సమస్యలతో పెరుగుతున్న పని భారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గర్భిణులు, బాలింతలైన లబ్ధిదారులు అంగన్వాడీ కేంద్రాల నుంచి టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) విధానం కింద పోషకాహార పదార్ధాలను తీసుకెళ్లేందుకు ఉన్న యాప్‌ల్లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ యాప్‌లను వినియోగించడానికి అంగన్వాడీ కార్యకర్తలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒక అంగన్వాడీ కేంద్రంలో ఎక్కడైనా పేరు, వివరాలు నమోదైన పేద కుటుంబాల వారు వ్యవసాయ, తదితర పనులకు వలసలు వెళుతుం టారు. ఆ లబ్ధిదారుల వివరాలు వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో పొందుపరిచినా, ముఖ గుర్తింపు యాప్‌లో ఆ వివరాలు కనిపించడం లేదు. ఫలితంగా తమకు సంపూర్ణ పోషణ పదార్ధాలు అందటం లేదని వలస వచ్చిన కుటుంబాల వారంటున్నారు. జిల్లాలోని 13 ప్రాజెక్టుల పరిధిలో 2903 మెయిన్, 227 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందుకు గాను అంగన్‌వాడీ కార్యకర్తలు 2596 మంది, ఆయాలు 2548 మంది, మినీ కార్యకర్తలు 227 మంది విధులు నిర్వహిస్తున్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు

కార్యకర్తలకు పెరిగిన భారం

పూర్వ ప్రాథమిక విద్య, పోషకాహార పంపిణీ, టేక్‌హోం రేషన్ విధానం అమలు ఇవన్నీ గతంతో పోలిస్తే అంగన్వాడీ కార్యకర్తలపై సహజంగానే పనిభారం పెంచాయి. వీటికి తోడు యాప్‌ల్లో సాంకేతిక సమస్యలు, కొంచెం పెద్ద వయసు కార్యకర్తలకు ఆయా యాప్‌లను సమర్ధంగా వినియోగించే నైపుణ్యం లేకపోవడం, క్షేత్రస్థాయి పర్యటన తదితర వివరాలన్నీ యాప్‌లోనే పొందుపరచాల్సి ఉండటం వంటివి వారికి సాంకేతికంగా చిక్కుసమస్య అవుతోంది. ఫలితంగా పని ఒత్తిడి పెరిగిదంటున్నారు. ఇచ్చిన పరికరాల్లో సాంకేతిక సమస్యల వల్ల పలువురు కార్యకర్తలు తమ సొంత చరవాణులతోనే ఆయా యాప్‌లను వినియోగిస్తున్నదున సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

లబ్ధిదారులు ఇళ్లు మారితే..

వ్యవసాయ పనుల నిమిత్తం వలస వచ్చి గ్రామాల్లో కొంత కాలం ఉండి వెళ్లే వలస కుటుంబాల వారు, వచ్చినప్పుడల్లా ఒకే అద్దె ఇంట్లో ఉండడానికి వీల్లేకపోవచ్చు .తరుచు ఇళ్లు మారే వారిని కార్యకర్తలు ఫోన్లో సంప్రదించినా వారు సకాలంలో అంగన్వాడీ కేంద్రానికి రాలేకపోతే రేషన్ ఇవ్వలేని పరిస్థితి ఎదురవుతోంది. గతంలో లబ్ధిదారుల తరపున ఎవరొచ్చినా రేషన్ ఇవ్వటానికి వీలుండేది. ప్రస్తుతం లబ్ధిదారుని ముఖచిత్ర గుర్తింపు యాప్ విధానంలో ఆయా లబ్ధిదారులే రావాల్సి ఉంటోంది. టీహెచ్ఆర్ పేరిట నెలవారీ నిత్యావసరాలను నెలలో రెండుసార్లు గర్భిణులు, బాలింతలకు అందించాల్సి ఉంటుంది. యాప్‌లో ముందుగా గర్భిణులు, బాలింతలకు చెందిన ముఖచిత్రాన్ని నమోదు చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో కొత్తగా వచ్చిన లబ్ధిదారుల వివరాలను పొందుపరిచిన తర్వాత అవే ముఖచిత్ర గుర్తింపు యాప్‌లో కనిపించాలి. కానీ వలస వచ్చిన వారి వివరాలు కనిపించడం లేదు. వారి వివరాలు ఇతర కేంద్రాల్లో ఉంటాయి. గర్భిణులు, బాలింతలకు ఇతర ప్రాంతాల్లో ఆర్‌సీహెచ్ గుర్తింపు నంబరు ఇచ్చినా, ఆధార్ వివరాలు సరిగా లేకున్నా వారి వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో వారికి టీహెచ్ఆర్ ఇవ్వలేని పరిస్థితి నెలకొంటోంది.


గర్భిణులకు ముఖ గుర్తింపు చేస్తున్న దృశ్యం

10లోపులోనే టీహెచ్ఆర్

కేంద్రాలకు దూరంగా ఉండే లబ్ధిదారులు ఇతర గ్రామాలకు పనులకు వెళ్లడం, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఉన్న గర్భిణులు, బాలింతలు సమయానికి కేంద్రానికి వచ్చి టీహెచ్ఆర్ తీసుకెళ్లలేకపోతున్నారు. ప్రతినెలా 1 నుంచి 10వ తేదీ లోగా కేంద్రానికి రాకపోతే వారికి రేషన్ ఇవ్వని పరిస్థితి. సమయానికి 70 శాతం మంది వస్తుంటే, మిగతా 30 శాతం మందికి అంగన్వాడీ కార్యకర్తలే ఇళ్లకు వెళ్లి ఇవ్వాల్సి వస్తోంది. దీంతో పూర్వ ప్రాథమిక విద్యా బోధనకు అంతరాయం ఏర్పడుతోంది.

అంగన్వాడీలకు పని భారం తగ్గించాలి



అంగన్‌వాడీలకు పని భారం తగ్గించాలి. యాప్‌ల ద్వారా వచ్చే ఇబ్బందులను ఎప్పుటికప్పుడు సమీక్షించి సమస్యలను త్వరగా పరిష్కరించాలి. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు కూడా సక్రమంగా పని చేయడం లేదు. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలి.

ఈదర అన్నపూర్ణ,
జిల్లా ప్రధాన కార్యదర్శి,
అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్


క్షతగాత్రుడ్ని అంబులెన్స్ లోకి ఎక్కిస్తున్న హైవే సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. టంగుటూరు చెల్లెమ్మతోటకు చెందిన దుడ్డు రంగారావు కుమారుడు వెంకట సుధీర్, వాణినగర్‌కు చెందిన కనిగర్లపూడి వెంకటేశ్వర్లు వ్యాపార పని నిమిత్తం ఆదివారం టంగుటూరు నుంచి ద్విచక్ర వాహనంపై ఒంగోలు బయలుదేరారు. తూర్పునాయుడుపాలెం జాతీయ రహదారిప్తై ఓవర్ బ్రిడ్జి పైన వేగంగా వెళుతూ ముందువైపు వెళుతున్న కారును తప్పించబోయిన ద్విచక్ర వాహనం డివైడర్‌కు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో దుడ్డు వెంకట సుధీర్ తల భాగం, శరీరంపై బలమైన గాయాలు కాగా వెంకటేశ్వర్లుకు ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జాతీయ రహదారి పెట్రోలింగ్ సిబ్బంది క్షతగాత్రులిరువురిని అంబులెన్స్‌లో ఒంగోలు తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. హైవే పోలీసు సిబ్బంది క్షతగాత్రుల వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి- చిన్నగంజాం

మండలం పరిధిలోని చిన్నగంజాం గ్రామంలో పేకాట ఆడుతున్నటువంటి ఎనిమిది మందిని ఆదివారం చిన్నగంజాం ఎస్సై కె.సురేష్ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1900లు నగదు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని సోమవారం నాడు కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్ఐ తిరుపతిరావు

మద్యం బాటిళ్లు స్వాధీనం

పంగులూరు: మండలంలోని చందలూరు గ్రామంలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి దగ్గర నుంచి 9 లిక్కర్ బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకొని, వ్యక్తిని అరెస్టు చేసినట్లు రేణింగవరం ఎస్సై తిరుపతిరావు తెలిపారు. చందలూరు గ్రామానికి చెందిన గొట్టిపాటి రమేష్ అనే వ్యక్తి అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యాన్ని అమ్ముతున్నాడని ఎస్ఐ తెలిపారు. ఆదివారం అతన్ని అరెస్ట్ చేసి షాపులో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

బైకులు ఢీ : నలుగురికి గాయాలు

పర్చూరు : మండలంలోని బోడవాడ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురు ఢీ కొన్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు గాయాలు అయ్యాయి. గుడివాడకు చెందిన నక్క సతీష్, తెనాలికి చెందిన పోచంపు ఇసాక్, కొప్పుసెట్టి మధు ముగ్గురూ ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. గాయపడ్డ క్షత గాత్రులను 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదానికి గురైన యువకులు

జిల్లా రెవెన్యూ అధికారిగా వెంకటరమణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారిగా పి.వెంకటరమణ జిల్లాకు రానున్నారు. కృష్ణాజిల్లా డిఆర్‌ఓగా పనిచేస్తున్న ఆయనను బాపట్ల జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. నెల రోజుల క్రితం జిల్లాకు డిఆర్‌ఓగా వచ్చిన మూర్తి వ్యక్తిగత కారణాలపై సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో వెంకటరమణ రానున్నారు.

కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి-కొండపి

మర్రిపూడి మండలం గంగపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త రాగిపిండి పూల్లారెడ్డి ఇటీవల జరిగిన ప్రమాదంలో చెయ్యి విరిగింది.. పూల్లా రెడ్డి ఆపరేషన్ చేయించి ఇంటికి రావడంతో కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆదివారం వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మర్రిపూడి మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే స్వామి

నేడు స్పందన కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గాంధీ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ సమస్యల కొరకు దూర ప్రాంతాల నుంచి ప్రజలెవరు కలెక్టరేట్‌కు రావద్దని, ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. అదే విధంగా బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోనూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదిక స్పందన కార్యక్రమాన్ని "అక్టోబర్ 2న సోమవారం" గాంధీ జయంతి సందర్భంగా తాత్కాలికంగా రద్దు చెయ్యడమైందని జిల్లా ఎస్పి వకూల్ జిందాల్ తెలిపారు. కావున తమ సమస్యలు తెలియజేయడానికి దూర ప్రాంతాల నుండి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంకు వచ్చే ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని వారు కోరారు.

'గ్రంథాలయంలో చదవడం మాకిష్టం' కార్యక్రమం

ప్రజాశక్తి-కొండపి

కొండపి శాఖ గ్రంథాయలంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బి.కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు చదవడం వలన విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని అన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాల సెలవు దినాలలో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.


గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

నేడు సత్యమేవ జయతే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-కొండపి

స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట నేడు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు సత్యమేవ జయతే నిరాహార దీక్ష కార్యక్రమం జరుగుతుందని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బి.యలమందనాయుడు తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా వారి సతీమణి నారా భువనేశ్వరి, చంద్రబాబు చేపట్టబోయే సత్యమేవ జయతే నిరాహార దీక్షకు సంఘీబావంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే స్వామి, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహణ కార్యదర్శి దామచర్ల సత్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలోని ఉన్న నాయకులు, కార్యకర్తలు అభిమానలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రశ్నార్ధకంగా మారిన గ్రామాభివృద్ధి

◆సర్పంచుల్లో ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ◆పంచాయితీ నిధులు పథకాలకు మళ్లింపు ◆ బ్లీచింగ్, పారిశుద్యానికీ నిధుల్లేని పంచాయితీలు ◆ నిస్సహాయంగా సర్పంచులు



గ్రామీణ పాలనా కేంద్రం పంచాయితీ కార్యాలయ భవనం

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు అధికార వైసిపి సభ్యత్వానికి రాజీనామా చేయడంతో వైసిపికి ఎదురు దెబ్బ తగిలింది. రాష్ట్రంలో పంచాయితీ సర్పంచుల పట్ల ప్రభుత్వ అనుసరిస్తున్న వ్యతిరేక విధానాల తీరుకు నిరసనగా పాపారావు వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బాపట్ల జిల్లా రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలోని లంకెవానిదిబ్బ పంచాయతీ సర్పంచ్ గా ఆయన కొనసాగుతున్నారు. అయితే సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతానని, వైసిపి సభ్యత్వానికి మాత్రమే రాజీనామా చేశానని ఆయన తాజాగా ప్రకటించారు. వైసిపి సర్పంచులుగా చలామణి అవుతున్న అధికార పార్టీలో తమ పంచాయతీల అభివృద్ధి ప్రశ్నార్ధకంగా మారిందనే నిరాశలో సర్పంచులు ఉన్నారు. దీంతో ఆ సంఘం రాష్ట్ర నాయకుడు రాజీనామాతో పాలక పక్షానికి గొంతులో వెలక్కాయ పడ్డట్టయింది. పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు సైతం సర్పంచులకు తెలియకుండానే ప్రభుత్వ ఖజానాకు దారి మల్లుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో రాజకీయ ప్రత్యర్ధి పోరులో నువ్వా నేనా అనే రీతిలో ఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నికల్లో పంచాయితీ సర్పంచ్ గా గెలిచినా, కనీసం గ్రామాల్లో రోడ్లు మరమ్మత్తులకు చారెడు మట్టేసేందుకు కూడా డబ్బులు లేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. పంచాయతీల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ఎందరో సర్పంచులు ఆత్మన్యూనతతో ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. సర్పంచులే బహిరంగంగా ఆవేదన చెందుతున్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో సర్పంచులను డమ్మీగా మార్చేసిందనే విమర్శ ఉంది. అధికార పార్టీ సర్పంచులు కక్క లేని మింగలేని పరిస్థితిలో ఉన్నారు.

గ్రామ సభలు పెట్టలేని దుస్థితి

దేశానికి గ్రామాలు పట్టుకొమ్మలని గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్రంలో నీరుగారి పోయిందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 2న గాంధీ జయంతి సందర్భంగా నాలుగు రోజులపాటు గ్రామసభలు నిర్వహించాల్సి ఉంది. అయితే గ్రామసభలు నిర్వహించే దిశగా గ్రామ పంచాయతీలు అడుగులు వేయడం లేదు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు సర్పంచులకు గ్రామ సభల అంశాన్ని సెప్టెంబర్ 25న తెలియజేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు ఈ అంశంపై చర్చ పంచాయతీలలో జరగలేదని చెబుతున్నారు. గ్రామాల్లో అధిక వర్షాలకు నీరు నిలబడితే కనీసం రహదారులు శుభ్రం చేసి చిట్టెడు సున్నం చల్లే పరిస్థితి కూడా లేదని బహిరంగంగా చెబుతున్నారు. రాష్ట్రంలో 12వేల918 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు 14, 15 ఆర్థిక సంఘాల ద్వారా కేంద్ర ప్రభుత్వం పంపిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించిందని సర్పంచులు బహిరంగ ఆరోపణ చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగకుండా గ్రామ సర్పంచులను ఉత్సవ విగ్రహాలు లాగా చేసి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడుస్తోందని అధికార పార్టీకి చెందిన సర్పంచిలే ఎటు చెప్పుకోలేక మదన పడుతున్నారు, రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన సర్పంచులకు గ్రామ సచివాలయ, గ్రామ వాలంటీర్ల సమాంతర వ్యవస్థను నడిపిస్తూ రాజ్యాంగబద్దంగా ప్రజలు ఎన్నుకున్న సర్పంచులకు నిధులు, విధులు హక్కులు బాధ్యతలు హరించి వేశారని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీలో సొమ్ము ప్రభుత్వం దోచుకుంది : సర్పంచులు

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల్లోని ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 14వ ఆర్థిక సంఘం నిధులు 2018 – 19కి రూ.1729.23కోట్లు, 2019 – 20కి రూ.2336.56కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు 2020 – 21కి రూ.2625కోట్లు, 2021–22కి రూ.1939కోట్లు మొత్తం రూ.8629.79కోట్లు పంచాయతీలకు మంజూరు చేసింది. వీటిని పంచాయితీలకు చెందకుండా, చెక్కులపై సర్పంచుల సంతకాలు లేకుండా, సర్పంచులకు చెప్పకుండా గ్రామ పంచాయతీల సిఎఫ్ఎంఎస్ అకౌంట్లో నుండి నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించి తన సొంత అవసరాలకు, పథకాలకు దారి మళ్లించిందని సర్పంచులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి వినియోగించుకున్న రూ.8629.79కోట్లు తక్షణమే తిరిగి గ్రామ పంచాయతీలకు జమ చేయాలని సర్పంచులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తిరిగి గ్రామ పంచాయతీలకు సొమ్మును జమ చేయకపోతే సర్పంచులు ఉద్యమ బాట పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.



విజయవాడ యుటిఎఫ్ సభకు బయలుదేరిన టీచర్లు

యుటిఎఫ్ ఉత్సవాలకు ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - అద్దంకి

విజయవాడలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 50వసంతాల సభకు అద్దంకి నుండి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు స్థానిక బంగ్లా రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి తరలి వెళ్లారు. యుటిఎఫ్ సిల్వర్ జూబ్లీ వేడుక జరుపుకోవడం, దీనికి కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావడం చాలా సంతోషమని యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జె బాబురావు అన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ ఎప్పుడు ముందంజలో ఉంటుందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి హరిబాబు అన్నారు. యుటిఎఫ్ అద్దంకి మండల అధ్యక్షులు రామారావు, కార్యదర్శి పూర్ణచంద్రరావు, ట్రెజరర్ దామ రామాంజనేయులు, సీనియర్ నాయకులు సోమేపల్లి హనుమంతరావు, మస్తాన్ వలి, కె గంగాధర్, బివి రత్నం, బ్రాహ్మజీ, శ్రీను, సాంబశివరావు, కోటేశ్వరరావు, రాజశేఖర్, శ్రీనివాసరావు తోపాటు మరో 45మంది ఉపాధ్యాయులు తరలి వెళ్లారు.


డాక్టర్ సుబ్బారావును సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్లు

డాక్టర్ సుబ్బారావుకు సన్మానం

ప్రజాశక్తి - చీరాల

పట్టణం ఆర్ఓబి సమీపంలో వృద్ధుల సంక్షేమ సంఘ కార్యాలయంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. సందర్భంగా వృద్ధులను ఘనంగా సన్మానించారు. వృద్ధాప్యం వరంగా భావించాలని అన్నారు. ప్రభుత్వం ద్వారా వృద్ధులకు అందుతున్న రాయితీలను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో వృద్ధాశ్రమాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల మీద ఆధారపడకుండా వృద్ధులు మనోధైర్యంతో జీవితం గడపాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, నాగ వీరభద్రాచారి, బ్రహ్మారెడ్డి, గంగాధరరావు, రవికుమార్, జయరాజ్ పాల్గొన్నారు.


వృద్ధులను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్

వృద్ధులను ఆదరించాలి

ప్రజాశక్తి - బాపట్ల : నేటి యువకులే రేపటి వృద్ధులని గుర్తెరిగి వృద్ధులను ప్రేమాభిమానాలతో ఆదరించాలని వైద్యులు కె వెంకట నరేంద్ర అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ కుటుంబ సభ్యుల నుండి నిరాదరణకు గురై అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎంతటి వారికైనా వృద్ధాప్యం తప్పదన్నారు. యువకులు వృద్ధులయ్యాక పరిస్థితి ఏంటని యోచించాలన్నారు. వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైళ్లు, బస్సులలో రాయితీ కల్పించాలని కోరారు. 75ఏళ్ళ పైబడిన 6మంది సీనియర్ సిటిజన్సను సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బంధ దుర్గాసుందర ప్రసాద్, పిసి సాయిబాబు, జూలగంటి కృష్ణారావు, కాగిత శ్రీహరిరావు, బొలగాని వెంకటేశ్వర్లు, జి శాంతారామ్, డబ్బ్యా జికే మూర్తి, నరహరి వెంకటశివరావు, అవ్వారి వెంకటేశ్వర్లు, చరిత్ర పరిశోధకులు మన్నే శ్రీనివాసరావు, జివి బ్రహ్మం పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించటం అందరి బాధ్యత


వృద్ధాశ్రమంలో పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహానా

ప్రజాశక్తి - చీరాల

సమాజంలో వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యతని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ షేక్ రెహానా అన్నారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆమె సురేష్ మహల్ సమీపంలోని వృద్ధాశ్రమాన్ని ఆదివారం సందర్శించారు. వృద్ధుల సాధక బాధలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధాశ్రమాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. వృద్ధాప్యం అనేది శాపం కాదని, వరమని భావించాలని అన్నారు. వృద్ధశ్రమంలో ఆరోగ్యం, ఇతర సమస్యలు ఎదురైతే లీగల్ అడ్వైజర్ అందుబాటులో ఉంటారన్నారు. మీ పిల్లలు పేపర్లపైన సంతకాలు పెట్టమని ఒత్తిడిచేస్తే ఆ సమయంలో ఎవరైనా చదువుకున్న వారితో ఆ పేపర్లను చదివించుకుని సంతకాలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరవ రమేష్ బాబు, ఒకటవ పట్టణ ఎస్ఐ ఆర్ అహ్మద్ జానీ, ఎఎస్ఐ సత్యనారాయణ, ఆశ్రమ నిర్వాహకులు సాయిరెడ్డి, పారా లీగల్ సలహాదారు ఎస్కే మదీన్ పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలను ప్రతిఘటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు



మాట్లాడుతున్న సిపిఎం నేత కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి - కొండెపి

సర్దుబాటు చార్జీలు, ఇంధన చార్జీలు, సర్ చార్జీలు అంటూ ప్రజలపై ఎడాపెడా విద్యుత్ చార్జీల మోత మోగిస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని సిపిఎం ప్రకాశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అన్నారు. మండలంలోని పెరిదేపిలోని ముప్పరాజు శేషయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన సిపిఎం మండల కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఏనాడో వాడుకున్న కరెంటుకు ఆనాడు బిల్లు కట్టినప్పటికీ నేడు మళ్ళీ సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మీద కొత్త రకం భారాలు వేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న 2022విద్యుత్ సంస్కరణలో అనేక వినాశకరమైన అంశాలు ఉన్నాయని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ చార్జీల వసూలు పద్ధతులు అమలులో లేవని అన్నారు. అదనపు అప్పుల కోసం ఏపి ప్రభుత్వం మాత్రమే దీన్ని అమలు చేస్తున్నదని అన్నారు. గడచిన నాలుగేళ్ల కాలంలో రాష్ట్రంలో రూ.25వేల కోట్లు ప్రజల నుండి రకాల చార్జీల పేర్లతో వసూలు చేశారని తెలిపారు. ఈ సంస్కరణలలో భాగంగా ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తారని చెప్పారు. సెల్ఫోన్లో రీచార్జి చేయించుకున్నట్లు ముందస్తుగా విద్యుత్ రీచార్జి చేయించుకోవాల్సి వస్తుందని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే పద్ధతి ఆంధ్రప్రదేశ్లో మొదట పెట్టారని, విద్యుత్ సంస్కరణలకు ప్రయోగశాలగా మన రాష్ట్రాన్ని మార్చారని అన్నారు. 2000సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా ఉద్యమంతో 20ఏళ్ల పాటు రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచేందుకు ఏ ప్రభుత్వం సిద్ధపడలేదని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి కెజి మస్తాన్ మాట్లాడుతూ జిల్లా ప్రజల ప్రధాన సమస్యలను ఎజెండా చేస్తూ ఇటీవల సిపిఎం నిర్వహించిన పాదయాత్ర ప్రజలను మేల్కొల్పే యాత్రలా సాగిందని అన్నారు. యాత్రలో గుర్తించిన సమస్యలపై ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటి సభ్యులు అంగలకుర్తి చిన్నబ్రహ్మయ్య, గడ్డం వందనం, మల్లెల పెద్ద పేతురు, పొరాబత్తిన శ్రీనివాసులు, ఎల్ పరిశుద్ధరావు, పి జక్రయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని కావూరివారిపాలెంలో డాక్టర్ ఎన్టిఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం శ్రమదానం చేశారు. ఆహార కల్తీలను గుర్తించడం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ డాక్టర్ విమల బీరా, డాక్టర్ భ్రేస్సీ సాగర్, పిడి ఫణీంద్ర కుమార్, ఆర్బికె ఛైర్మన్ కావూరి రమణరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని తీర ప్రాంత గ్రామాలలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. దేశాయిపేట పంచాయతీ జెడ్పి ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ రూతమ్మ, ఈఓ పిఆర్అండ్ఆర్డి ఎస్ శ్రీలక్ష్మి, స్పెషల్ ఆఫీసర్ పి రామ్కుమార్, పంచాయితీ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ లేళ్ల శ్రీధర్, బొడ్డు సుబ్బారావు, కర్ల ప్రసాద్ పాల్గొన్నారు. పాపాయిపాలెం పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల వద్ద శ్రమదానం చేశారు. స్పెషల్ ఆఫీసర్ కాశీ విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శి పి పూర్ణకుమారి, సచివాలయం కన్వీనర్ హరికృష్ణ, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని కారంచేడులో స్వచ్ఛతే హి సేవ కార్యక్రమంలో స్థానిక లైబ్రరీ చెరువు చుట్టూ, పంచాయతీ వెనక ప్రదేశంలో శ్రమదానం చేశారు. కార్యక్రమానికి సర్పంచ్ బాలిగ శివపార్వతి శ్రీనివాస్, ఈవోపీఆర్ అండ్ ఆర్డి ఆర్ రమేష్ బాబు, ఎవో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి కె అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, జెవిఎస్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ వంశీ, బైపిస్టు, సచివాలయ కార్యదర్శులు మాధవి, రాజామోహన్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..

- ప్రమాదకరంగా రోడ్డు మలుపు
- డ్రెయినేజీతో పొంచి ఉన్నముప్పు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని అనకర్లపూడి గ్రామంలో ఎన్‌టిఆర్ సుజలం ఎదురుగా ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉంది. అక్కడ ఎవరైనా ఆదమరిస్తే ప్రమాదానికి గురికాక తప్పదు. గ్రామంలోని మురుగునీరు వెళ్లే రోడ్డు రోడ్డు మధ్యలో డ్రెయినేజ్ ఏర్పాటు చేశారు. అది మలుపు వద్ద ఉంది. అదే విధంగా మలుపు వద్ద రహదారికి ఇరువైపు రక్షణ గోడలు కట్టడం మరిచారు. కనీసం ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయం, రాత్రి పూట అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. ఇది కొండపి నుంచి మద్దులూరు మీదుగా ఒంగోలు వెళ్లే రహదారి కావడంతో వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ సమయంలో ఎవరైనా ఆదమరిస్తే మలుపు వద్ద ప్రమాదానికి గురికాక తప్పదు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించు కోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపు వద్ద ప్రమాదక సూచికలు ఏర్పాటు చేసిన ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. మలుపు వద్ద రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



ప్రమాదభరితంగా మారిన రోడ్డు మలుపు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

టిడిపి నాయకుల ర్యాలీ

ప్రజాశక్తి-టంగుటూరు

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై సిబిఐ బనాయించిన అక్రమ కేసులను కొట్టివేయాలని కోరుతూ మండల పరిధిలోని సూరారెడ్డిపాలెం గ్రామ టిడిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి మొలకలపల్లి కోటేశ్వరరావు, నాయకులు మొలకలపల్లి శ్రీను, కమ్మ శ్రీహరి, మొలకలపల్లి వెంకట్రావు, నర్రా జగదీష్ బాబు, తుళ్లూరి సత్యనారాయణ, తుళ్లూరి సుబ్బారావు, ఏలూరి శ్రీనివాసరావు, నర్రా అనిల్, చిమ్మిరి శ్రీహరి, చుంచు కిషోర్, సుంకర సుభాషిణి, నారా తిరుపతి, మొలకలపల్లి పద్మ పాల్గొన్నారు.

కందులూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-టంగుటూరు

కార్పొరేట్ వైద్యులందరూ విచ్చేసి గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బెతూన్ నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ సందీప్ ప్రకాష్, డాక్టర్ టి. స్వాతి తెలిపారు. మండల పరిధిలోని కందులూరులో సీనియర్ నాయకులు ఉప్పలపాటి రామరాజు, గ్రామ సర్పంచి పసుమర్తి ఈశ్వరమ్మ సౌజన్యంతో బెతూన్ బెతూన్ నర్సింగ్ హోం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగాఉప్పలపాటి రామరాజు, సర్పంచి పసుమర్తి ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఎంతో పేరు గడించిన ఒంగోలు బెతూన్ నర్సింగ్ హోం వైద్యులు తమ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతోష దాయకమన్నారు. ఈ సందర్భంగా 125 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మన్నం వెంకయ్య, ఉప్పలపాటి సత్యరాజు, రామిశెట్టి దాసయ్య, పసుమర్తి ఆనంద్, పసుమర్తి రాజేష్, గోగుల వెంకట్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సందీప్, డాక్టర్ స్వాతి

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశు భ్రతను పాటించాలని సింహపురి ఎక్స్ ప్రెస్ వే లిమిటెడ్ టంగుటూరు టోల్ ప్లాజా ప్రాజెక్టు ఇన్‌ఛార్జి శివ కుమార్ తెలిపారు. స్వచ్ఛ తాహి సేవా, ఏక్ తారీఖ్.. ఏక్ గంట నినాదంతో టోల్ ప్లాజా ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై స్వచ్ఛత సేవా కార్యక్రమాలను టోల్ ప్లాజా అధికారులు, సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులను ఆపి స్వచ్ఛత సేవ ప్రాముఖ్యత గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్లు ప్రదీప్ సింగ్ హుడా, చెన్నంశెట్టి సాంబయ్య, పిఆర్‌ఒ కొత్తపల్లి నరసింహారావు, అకౌంట్స్ మేనేజర్ రాజా, హెచ్ఎస్ ఎస్ఇ మేనేజర్లు నాగార్జున రెడ్డి, చక్రవర్తి, టోల్ ప్లాజా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న టోల్ ప్లాజా సిబ్బంది



నగదు అందజేస్తున్న సర్పంచి అంజిరెడ్డి

రూ.10 వేల నగదు అందజేత

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని కండ్లగుంట గ్రామానికి టిడిపి అధ్యక్షుడు ప్రసాదరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మట్టి ఖర్చుల నిమిత్తం వైఎస్ఆర్ బీమా పథకం మట్టిఖర్చుల నిమిత్తం రూ. 10వేల నగదును గ్రామ సర్పంచి పల్లెర్ల అంజిరెడ్డి చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పాలపర్తి రత్తయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ వేణు తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరు పంచాయతీ కార్యాలయం వద్ద స్టార్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిపి, షుగరు వ్యాధులకు సంబంధించి 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టార్ ఫౌండేషన్ కార్యదర్శి ఎస్. తన్మయ్ రెడ్డి, విశ్రాంత హెల్త్ సూపర్ వైజర్ కెవిఎల్. నాగేశ్వరరావు, స్వాతి, దుర్గాప్రసాద్, గోనుగుంట వీర బ్రహ్మం, స్టార్ ఫౌండేషన్ అధ్యక్షులు సూరి లతారెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ ఓటరుకు సత్కారం

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఎన్నికల కమిషన్ ఆదేశా ఆదేశాల ప్రకారం 80 సంవత్సరాలు దాటిన ఓటర్లకు చిరు సత్కార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అందులో భాగంగా శింగరాయకొండలోని పోలింగ్ కేంద్రం నెంబర్ 256లోని ఓటరు కాకా సుబ్బారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ, బిఎల్‌ఒ రాము, వార్డు మెంబర్లు ఓలేటి రవిశంకర్‌రెడ్డి రాజు, వెంకటేశ్వర్లురెడ్డి, కాకా శ్రీనివాసరావు, కాకా సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



ఓటర్‌ను సన్మానిస్తున్న అధికారులు

శింగరాయకొండలో న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-శింగరాయకొండ

అంతర్జాతీయ వయోవద్ధుల దినోత్సవం సందర్భంగా మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని అభ్యుదయ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ ట్రస్ట్ భవనంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఆదివారం నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, కందుకూరు కోర్టు సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయ్ బాబు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రేమతో ఆస్తి వీలునామా రాసే విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. వీలునామా రాసిన వ్యక్తి తాను బ్రతికి ఉన్నంత కాలంలో ఎప్పుడైనా తనకు నచ్చకపోతే వీలునామాను రద్దు చేసుకోవచ్చునన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పేరున వీలునామా రాసినప్పుడు పిల్లలు వారి బాగోగులు పట్టించుకోకపోతే సదరు వీలునామాను రద్దు చేసుకోవచ్చన్నారు. వీలునామా రిజిస్టర్ చేసినా లేదా చేయించుకోక పోయిననూ చెల్లుతుందన్నారు. వీలునామాకు సాక్షులు ముఖ్యమన్నారు. వీలునామా రాసే వ్యక్తి కంటే తక్కువ వయసు ఉన్న వారికి సాక్షులుగా పెట్టుకుంటే మంచిదన్నారు. అదేవిధంగా వీలునామా రాసే తల్లిదండ్రులు ఆస్తి తమ పూర్వీకుల ద్వారా సంక్రమించిన ఆస్తి అయితే తమ వాటాకు వచ్చిన ఆస్తిని మాత్రమే వీలునామా రాయాలన్నారు. అలాగే వీలునామా రాసే వ్యక్తి ఆస్తిని స్వార్జితంగా సంపాదించుకుంటే ఎవరికైనా వీలునామా రాయవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వయోవద్ధులు అడిగిన న్యాయపరమైన సందేహాలను ముఖాముఖిగా నివత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య, డాక్టర్ బి హరిబాబు, సీనియర్ న్యాయవాదులు కొల్లూరు వెంకట నరసింహారావు, బక్కమంతుల వెంకటేశ్వర్లు, న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు, అభ్యుదయ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ ట్రస్టు కార్యదర్శి జెట్టి సూర్య చంద్ర శేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి విజయ్ బాబు



గృహ ప్రవేశ వేడుకల్లో బాలినేని ప్రణీత్ రెడ్డి

జగనన్న కాలనీలో గృహ ప్రవేశం

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం రంగాయపాలెం పంచాయతీలో 63 మందికి జగనన్న కాలనీ లేఅవుట్ ఏర్పాటు చేశారు. గృహ నిర్మాణం పూర్తి చేసుకున్న షేక్ మసూద్ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్ రెడ్డి తనయుడు ప్రణీత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా బాలినేని ప్రణీత్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో 63 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలం ఇచ్చినట్లు తెలిపారు. వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంత ఇంటి కలను సహకారం చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకొనేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి , సర్పంచి గాలి స్వరూప, నాయకులు గాలి మునసలారెడ్డి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిభిరం ప్రారంభిస్తున్న రోటరీ అధ్యక్షులు మోహనరావు

రోటరీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిభిరం

ప్రజాశక్తి - వేటపాలెం

గుండె పదిలంగా ఉంటే మనిషి పది కాలాలపాటు జీవించగలడని విజయవాడ హెల్ప్ హాస్పటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కిరణ్, డాక్టర్ సాయి అన్నారు. స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజీలో వేటపాలెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శిభిరంలో 140మందికి ఈసీజీ, ఎకో పరీక్షలు ఉచితంగా చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సంక్లిష్టంగా ఉన్న 40మందిని వైద్య పరీక్షలు నిమిత్తం విజయవాడ హెల్ప్ హాస్పటల్‌కు రిఫర్ చేశారు. వైద్య శిబిరాన్ని క్లబ్ కోశాధికారి తిరుమలశెట్టి కోటేశ్వరరావు ప్రారంభించారు. మందుల విభాగాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షుడు బట్ట మోహనరావు ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ వ్యవస్థాపక అధ్యక్షులు గొల్లపూడి సీతారాం, కార్యదర్శి ఎవి సురేష్ బాబు, సభ్యులు ప్రత్తి వెంకట సుబ్బారావు, డాక్టర్ కారంచేటి శివరామకృష్ణ, పొగడదండ రవికుమార్, కొత్త శ్రీనివాసరావు (వాసు), నున్న నాగేంద్రరావు, ఖదీర్ భాష, డాక్టర్ దివి పవన్ పాల్గొన్నారు.


యోగా పోటీలకు హాజరైన విద్యార్థులు

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి - బాపట్ల

యోగ సాధనతో శరీరానికి అవసరమైన ప్రాణశక్తి పుష్కలంగా అందుతుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ బి శరత్ బోస్ అన్నారు. రాష్ట్రస్థాయి యోగాసన పోటీల ఎంపిక, బాపట్ల జిల్లా యోగాసన ఛాంపియన్ షిప్ 2023 పోటీలు యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాపట్ల ఎకో హౌస్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ బోస్ మాట్లాడుతూ యోగాతో గుండె, ఊపిరితిత్తులు, మెదడు కణాలు ఉత్తేజం పొంది ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ధృతి సంస్థ అధ్యక్షులు కళ్ళం హరినాధరెడ్డి మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా ఏర్పడ్డాక నిర్వహిస్తున్న యోగ సాధన యువతి, యువకులు వినియోగించుకోవాలని అన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అల్లాడి రవి కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఇక్కడ ఎంపికైన బాల, బాలికలు ఈనెల 14, 15తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో బాలిక గురుకుల పిఈటి పి శాంత కుమారి, మున్సిపల్ హైస్కూల్ పీఈటి కత్తి శ్రీనివాసరావు, వేమన యోగ సాధన మందిర్ యోగ సాధకులు పాల్గొన్నారు.


బిసి నేత రవికుమార్‌కు నోటీసులు ఇస్తున్న పోలీసులు

పరామర్శకు వెళ్లకుండా గృహనిర్బంధం

ప్రజాశక్తి - బాపట్ల

చెరుకుపల్లి మండలంలో అమర్నాద్ హత్య కేసులో నిందితులు బెయిల్‌పై వచ్చి బాధ్యత కుటుంబ సభ్యుల్ని బెదిరించడాన్ని బీసీ సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ ఖండించారు. బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించేందుకు సమాయత్తమవుతున్న తరుణంలో వెళ్లేందుకు వీల్లేదంటూ రవికుమార్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పోలీసులు నోటీసులు అందజేశారు. భావ ప్రకటన స్వేచ్ఛను సైతం కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

వినూత్నంగా టిడిపి నిరసన దీక్షలు

బాపట్లలో మహిళల దీక్షలు
రేపల్లెలో మోకాళ్లపై నిరసన
వేమూరులో నక్కా ఆనందబాబు నిరసన
కారంచేడులో మహిళల నిరసన

ప్రజాశక్తి - బాపట్ల

చంద్రబాబుపై కక్ష కట్టి స్కిల్ డెవలప్మెంట్‌లో లేని స్కాంను సృష్టించి అవినీతిని అంటగట్టి అక్రమ కేసుల్లో ఇరికించారని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో క్షత్రియ మహిళలు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఎటువంటి అవినీతి జరగలేదని అన్నారు. అందులో ఉపాధి పొందుతున్న ఉద్యోగులే బహిరంగంగా ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే జగన్ ప్రభు త్వం నీతిమాలిన తనంగా వ్యవహరి స్తుంద ని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎంతోమంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి అనేక ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించిందని అన్నారు. పోలీసులు, అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని


బాపట్ల దీక్షల్లో సంతకాలు చేస్తున్న మహిళలు

అన్నారు. వైసీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. టిడిపి ఘన విజయం సాధిస్తుందన్నారు. **భట్టిప్రోలు :** వేమూరు మండలంలోని చావలి గ్రామంలో ఆదివారం టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా నిరాహార దీక్ష నిర్వహించారు. దీక్షలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్ పాలనలో రోజురోజుకు అక్రమాలు, అవినీతి పెరిగిపోతుందని అన్నారు. గొంతెత్తి మాట్లాడే ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా వ్యవహరిస్తుందని అన్నారు. ప్రజలు ప్రతి అంశాన్ని పరిశీలిస్తూనే ఉన్నారని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా, అక్రమ అరెస్టులు చేసిన భయపడే ప్రసక్తే లేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి


అద్దంకి దీక్షల్లో ఎంఎల్ఎ గొట్టిపాటి రవి

అధికారం చేపడుతుందన్నారు. ఓటమి భయంతోనే జగన్మోహన్ రెడ్డి అక్రమ కేసులు బనాయి స్తున్నారని ఆరోపించారు. వేలకోట్ల అక్రమా స్తులు కూడబెట్టిన జగన్మోహన్ రెడ్డి ఎదుటి వారిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అనంతరం దీక్షకులో ఉన్నవారికి నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. టిడిపి నాయకులు దండే సుబ్బారావు, జొన్నలగడ్డ విజయబాబు పాల్గొన్నారు. **అద్దంకి :** చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా 19రోజుల నుండి రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారు. ఆదివారం దీక్షలో సంతమాగులూరు మండల టిడిపి నాయకులు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ సందర్శిం చారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జగన్ పైశాచికానందం పొందుతున్నారని అన్నారు. ప్రజాగ్రహంలో వైసీపీ కొట్టుకుపోతుందని అన్నారు. జగన్ పరిపాలనను ప్రజలే చీదరించుకుంటు న్నారని అన్నారు. ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసి అరెస్టులు, అక్రమ కేసులు పెడుతు న్నారని అన్నారు. పన్నుల బాదుడు, విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ చార్జీల పెంపుపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చి ఓటమి భయంతో అక్రమ కేసులకు పాల్పడ్డారని అన్నారు. చంద్రబాబు, లోకేష్ సభలకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓటమి భయంతో జగన్ ఉన్నారని అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా జైలులో చంద్రబాబు , ఢిల్లీలో నారా లోకేశ్ నిరసన దీక్ష చేపడతారని అన్నారు. వారికి సంఘీభావంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్ని కేసులు, కుట్రలు చేసినా 2024లో చంద్రబాబు సిఎం కావడం ఖాయమని అన్నారు. అప్పుడు వైసిపికి మోత మోగిస్తామన్నారు. **రేపల్లె :** చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి శ్రేణులు చేపట్టిన రిలే దీక్షలు 18వ రోజుకు చేరాయి. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్టీలు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా యానాది మహానాడు నాయ కులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షాల మనుగడను సహిం చలేక అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తుందని ఆరోపించారు. అణచివేత, కేసులు వంటి దుశ్చర్యలతో ప్రతిపక్ష నేతల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలని చూడటం అవివేకమన్నారు. టీడీపీ తోనే రాష్ట్ర భవిషత్ అని నినాదాలు చేశారు. టీడీపీ నాయకులు అనగాని శివ ప్రసాద్, మల్లిఖార్జునరావు, నాగమల్లేశ్వరరావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, వై ధర్మతేజ పాల్గొన్నారు. **చీరాల :** చంద్రబాబు అక్రమ అరెస్టు, రిమాండ్ విధించటంపై టిడిపి ఇన్చార్జి ఎంఎం కొండయ్య ఆద్వర్యంలో ఆదివారం రిలే దీక్షలు 19రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో యువత అధ్యక్షుడు వంకా హరికృష్ణ, అధికార ప్రతినిధి షేక్ గౌసానా, సభ్యులు బట్ట నాగరాజు, సజ్జ గణేష్ బాబు, దూదేకు ల నజీర్, షేక్ రజాక్, బండ్ల జైగణేష్, గుత్తి హిమంత బాబు, షేక్


వేమూరు దీక్షల్లో నక్క ఆనందబాబు

కాలేషాలు పాల్గొ న్నారు. ఉసురుపాటి సురేష్, గుత్తికొండ కిషోర్లు సంఘీభావం ప్రకటించారు. **కారంచేడు :** వైసిపి కుట్రలకు టిడిపి భయపడేది లేదని పర్చూరు ఎఎంసి మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కాయ్ చౌదరి అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును, రిమాండ్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక టిడిపి కార్యాలయంలో 23వ రోజు ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు కంభంపాటి నరేంద్ర, పాతూరి ఆదిలక్ష్మి, పోతిని వెంకటేశ్వర్లు, కాలేషా వలి, సురేష్, పద్మా, వెంకట రత్నం, లక్ష్మీనారాయణ, తాళ్లూరి అనిల్, కోటపాటి పిచ్చయ్య, హరి, పాతూరి శివరాం, బోయిన శీను, సాయి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

597మంది హాజరు 389మందికి కంటి చికిత్సకు రిఫర్

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి, అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో మార్టూరు జడ్పీ హై స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తొలుత ఎన్‌టిఆర్, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. మొత్తం 597మంది హాజరయ్యారు. 389మందిని కంటి వైద్య శస్త్ర చికిత్సకు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు రిఫర్ చేశారు. క్యాంపుకు హాజరైన వారికి బీపీ, రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నోవా అగ్రి గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఏటుకూరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ గత 16ఏళ్లుగా ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రిగ్రూప్స్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి కంటి చూపు అందించడమే లక్ష్యంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లక్ష మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించడమే లక్ష్యంగా టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు. ఎమ్మెల్లే ఏలూరి సాంబశివరావు కృషి చేస్తున్నారని


మెడికల్ క్యాంపు ప్రారంభిస్తున్న ఏలూరి ట్రస్ట్ ప్రతినిధులు

అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం కంటి వైద్య శిబిరాలతో పాటు మోకాళ్ళ ఆపరేషన్లు, మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే ఏలూరి రాజకీయాలకతీతంగా సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరికి నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తాటి నాగేశ్వరరావు, తొండేపు ఆదినారాయణ, కామేపల్లి హరిబాబు, పెంట్యాల శ్రీను, సాంబయ్య, రవి, ఫారుక్, సుభాని, కృష్ణ, చిరంజీవి, సిద్దు, నాగరాజు, రాజేష్, శివా, మణికంఠ పాల్గొన్నారు.

భట్టిప్రోలులో శ్రమదానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఆదివారం స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపిఆర్డి ఊహారాణి ఆధ్వర్యంలో జరిగిన శ్రమదానంలో ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి ఉదయభాస్కరి పాల్గొని మండల పరిషత్, తాసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో చీపురుతో పరిసరాలు శుభ్రం చేశారు. ప్రాంగణంలో పిచ్చి మొక్కలు తొలగించారు. భట్టిప్రోలు సర్పంచ్ ధారా రవికిరణ్మయి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో


స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో చీపురు పట్టిన ఎంపిపి లలితకుమారి

పిచ్చి మొక్కలు తొలగించారు. అంగన్వాడి కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్తలు శ్రమదానం చేసి కేంద్రాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ, చెన్నయ్య పాల్గొన్నారు.


స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్‌ను వినియోగించరాదు

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో స్వచ్ఛత సేవా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది శ్రమదానం చేసి కళాశాల పరిసరాల్లోని పిచ్చి మొక్కలు తొలగించారు. కళాశాల ప్రాంగణంలో చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వినియోగించడం వల్ల భావితరాలకు కలిగే నష్టాన్ని వివరించారు. వ్యసాయ భూమి కలుషితమవుతుందని అన్నారు. ఆహార పంటలు కలుషితమై అనారోగ్యం వస్తుందన్నారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు సంవత్సరానికి 100 గంటలు స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు. ఒక వంద మందితో స్వచ్ఛత కార్యక్రమం చేపడతామని ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల నివారణ గురించి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించుట కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డిడి స్మిత్, ఎం మాధవ, డాక్టర్ ఆర్ గణేష్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు కృపావతి, లావణ్య, వీరప్రసాద్ పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

- ఆధునిక జీవనశైలిలో వచ్చే వ్యాధులకు దివ్యౌషధం చిరుధాన్యాలు
- సజ్జ సాగుతో అధిక లాభాలు
- అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా 2023ని ఐక్యరాజ్యసమితి ప్రకటన

ప్రజాశక్తి - అద్దంకి

తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో మెట్ట భూముల్లో సైతం సాగు చేయగలిగిన చిరుధాన్యాల పంటల రైతులకు లాభసాటిగా ఉంటున్నాయి. ఈ పంటలకు రసాయన ఎరువులు, పురుగు మందుల అవసరం కూడా పెద్దగా ఉండదు. అంతేకాదు ఈ ధాన్యాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉంచవచ్చు. మదుమేహం, స్థూలకాయం, క్యాన్సర్, గుండె జబ్బులు వంటి ఆధునిక ఉరుకులు, పరుగుల జీవనశైలిలో వచ్చే వ్యాధులతో బాధపడేవారికీ చిరుధాన్యాల ఆహారం దివ్యఔషధంగా పనిచేస్తుంది. దీంతో ప్రస్తుతం మార్కెట్లో వీటికి జాతీయంగా, అంతర్జాతీయంగా భారీ డిమాండ్ ఏర్పడింది. అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకుని దిగుబడినిస్తాయి. అయితే చిరుధాన్యాల ప్రాము ఖ్యతను రైతులు, వినియోగదారులు, ప్రభుత్వ విధాన కర్తల్లో అవగాహన కల్పించడానికి 2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి 'అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్స రంగా' ప్రకటించింది. కాబట్టి చిరుధాన్యాల సాగుకు, విని యోగానికి అందరూ తమ వంతు పాత్రను పోషించాలి.

కరవు ప్రాంతాల కల్ప తరువులు

మారుతున్న కాలం, అలవాటు పడుతున్న కొత్త కొత్త ఆహార అలవాట్లతో సంప్రదాయ ఆహారపు అలవాట్లు



పంట దిగుబడి దశలో ఉన్న సజ్జ పంట

మరుగున పడుతున్నాయి. రుచి కోసం వాడుతున్న పలు రకాల పదార్థాలతో స్థూలకాయం, మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బులు, క్యాన్సర్, మానసిక రుగ్మతలు పెరుగుతు న్నాయి. కాబట్టి అధిక పోషకాలు, మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసి రైతులు మంచి లాభాలు పొందవచ్చు. సంప్రదాయంగా, వర్షాధార ప్రాంతాల్లో సాగుచేసే జొన్న, రాగి, సజ్జ, కొర్ర మొదలైన చిరుధాన్యాల సాగు మరుగున పడుతుంది. కానీ ప్రస్తుతం అధిక పోషకాలున్న ఆహారాన్ని తీసుకుంటుండటంతో ఈ పంటలకు భారీగా డిమాండ్ ఏర్పడుతుంది.

రైతుకు నష్టం ఉండదు

చిరుధాన్య పంటలు లోతైన వేరు వ్యవస్థ కలిగి, బెట్ట పరిస్థితులను తట్టుకొంటాయి. ఈ పంటలకు ఇతర పంటలకు వాడే నీటిలో 25-30శాతం తక్కువ సరిపోతుంది. వర్షాధార ప్రాంతాల్లో కరవు, బెట్ట పరిస్థితుల్లో వేరుశనగ వంటి పంటలు ఎండిపోయినా తిరిగి వర్షాలు పడినప్పుడు పుంజుకొని రైతుకు నష్టాన్ని తగ్గిస్తాయి. దీంతో పాటు ఈ పంటల అవశేషాలు, చొప్పను పశువులకు మేతగా అందించవచ్చు. మొక్కజొన్న వంటి ఆరుతడి పైర్లు సాగు చేసే డెల్టా ప్రాంతాల్లో కూడా చిరుధాన్య పంటలను లాభసాటిగా సాగు చేయవచ్చు. సజ్జ పంటకు నీటి వసతులు ఉంటే ఫిబ్రవరి నెలలో విత్తు కోవచ్చుని ఎఒ కె వెంకటకృష్ణ తెలిపారు. ఇటీవల జూన్, జూలై నెలలో కూడా సజ్జ పంటను నియోజకవర్గ పరిధిలో కొంతమంది రైతులు సాగు చేశారని తెలిపారు. సాధారణ మధ్యరకంగా ఉండే నేలలు, తేలికపాటి నేలల తోపాటు మురుగునీరు పారే నేలలు కూడా అనుకూలంగా ఉంటాయి. వీటితోపాటు నీరు ఇంకే నేలల్లో కూడా సజ్జ పంట సాగు చేయవచ్చని అన్నారు. దాదాపు 70రోజుల్లో పంట చేతికి వస్తుందని తెలిపారు. వాతావరణం అనుకూలిస్తే దాదాపు పది క్వింటాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. సజ్జ, రాగి, జొన్న సాగుతో అధిక దిగుబడులు, అధిక లాభాలు ఉంటాయని సూచించారు. రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.



వృద్దులను సన్మానిస్తున్న తహశీల్దారు కార్యాలయ సిబ్బంది

ప్రపంచ వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దారు కార్యాలయంలో వృద్ధ ఓటర్లను ఆదివారం ఘనంగా సన్మానించారు. పోలింగ్ స్టేషన్ 248బిఎల్ఓ నాగబాబు పరిధిలోని చెక్క నాగమ్మ, గాదే చిన్న, పెద్దన్న, వబ్బాని మహాలక్ష్మమ్మను తహశీల్ధారు కార్యాలయం తరపున సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్క ఓటరు తప్పకుండ ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఎస్ఓ జె పుష్పలత, విఆర్ఓలు నారపరాజు, శేషతల్పశాయి, వెంకట్రావు, సురేష్ పాల్గొన్నారు.



స్వచ్ఛత ర్యాలి నిర్వహిస్తున్న సిబ్బంది

శుభ్రతకు శ్రమదానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు పంచాయతీ సర్పంచి చౌటుర లక్ష్మి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఒక గంట పరిశుభ్రతకు శ్రమదానం అనే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. గ్రామ పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని చీపిరి పట్టి ఊడ్చి, రహదారి వెంట పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఎవరికి వారు స్వచ్ఛందంగా ఇంటి పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశు భ్రతను కూడా పాటించే విధంగా అవగా హన కలిగి ఉండాలని సర్పంచ్ లక్ష్మి సూచిం చారు. కార్యక్రమంలో కార్యదర్శి రామ్ కుమార్, రవీంద్రబాబు ఉన్నారు.



బీచ్‌లో పరిశుభ్రం చేస్తున్న బాపట్ల కమిషనర్

సూర్యలంకలో స్వచ్ఛతా సేవా

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ కాలుష్యం రాకుండా ఉండాలంటే పరిసరాల స్వచ్ఛత పాటించాలని బాపట్ల మునిసిపల్ కమీషనర్ భానుప్రతాప్ అన్నారు. స్వచ్ఛత సేవలో భాగంగా సూర్యలంక తీరంలో పారిశుధ్య పనుల్లో ఆయన పాల్గొన్నారు. తీరంలోని చెత్త చెదారాన్ని శుభ్రం చేశారు. తొలుత స్వ చ్ఛత వల్ల ఉపయోగాలను ఉద్యోగులకు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు ప్రేరణ పొంది ఏడాది కాలంలో ప్రతి ఒక్కరూ 100గంటలు స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. తద్వారా మరో 100మంది ప్రేరణ పొందేలా చేయాలని కోరారు. పరిసరాలు స్వచ్ఛంగా ఉంటే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అధికారులు, సిబ్బంది స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు.

ప్రత్యేక ఆంధ్ర రాష్టానికి 70 వసంతాలు

ప్రజాశక్తి -బాపట్ల

ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 70సంవత్సరాలు పూర్తయ్యాయని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర 70వ వార్షికోత్సవం సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని చంద్రకళ పార్కులోని విజయ స్థూపం వద్ద త్యాగధనులైన నాటి ఆంధ్ర నాయకులకు ఆదివారం నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అస్తిత్వానికి బాపట్లలోనే బీజం పడిందని అన్నారు. ఆంధ్రుల స్వరాష్ట్రవాంచకు బాపట్ల ముత్యాల పందిరి వేసిందని అన్నారు. ఆంధ్రోద్యమానికి బాపట్లలోనే అంకురార్పణ జరిగిందన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్ర వాదనకు బాపట్ల మొగ్గ తొడిగిందన్నారు. ఈ విధంగా ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావంలో బాపట్ల ది అద్వితీయమైన పాత్రని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర ప్రథమ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని 1954అక్టోబర్ 1న



విజయ స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పిసి సాయిబాబు

పట్టణ ప్రథమ మున్సిపల్ చైర్మన్ వెలగపూడి సుబ్బారావు చంద్రకళ పార్కులో విజయ స్థూపాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆంధ్రోద్యమంలో ఎందరో నాయకులు ఎన్నో త్యాగాలు చేశారని అన్నారు. చివరకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం సిద్ధించిందని తెలిపారు. కార్యక్రమంలో ఫోరమ్ సభ్యులు టి శ్రీదర్, హర్ష విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా అమర్తలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో భట్టిప్రోలు సెక్టార్ పరిధిలోని ఐలవరంలో అంగన్వాడి కార్యకర్తలు వినూత్న రీతిలో పోషక విలువలు కలిగిన పండ్లు, కూరగాయలతో ఐసిడిఎస్ లోగోను ఏర్పాటు చేశారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ బేబీ స్వర్ణలత పర్యవేక్షణలో కార్యకర్తలు సిద్ధం చేసిన ఈ లోగో గ్రామస్తుల ను ఆకర్షింపజేసింది. గర్భిణీ బాలింతలతో పాటు చిన్నారులకు అత్యంత పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. వీటితోపాటు ప్రకృతిలో లభించే అధిక పోషకాలు కలిగిన కూర



పోషకాహార లోగో

గాయలు, ఆకుకూరలు, పండ్లను ప్రతి ఒక్క రు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యకర్తలు స్వచ్ఛందంగా పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల ను సిద్ధం చేసి వాటి ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. సెక్టార్ పరిధిలో భట్టిప్రోలు, ఐలవరం గ్రామాల్లోని సుమారు 20మందికి పైగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు ఈ పోషక లోగో తయారీలో పాల్గొన్నారు. కార్యక్రమం లో సర్పంచి మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ శ్రీనివాసరావు, కార్యదర్శి జక్రియ, అంగన్వాడి కార్యకర్తలు డి రత్నకుమారి, రూప, ఉషారాణి, శివనాగలక్ష్మి, శివనాగకుమారి, నరసమ్మ ఉన్నారు.

పదోతరగతి పరీక్ష ఫీజు 10లోపు చెల్లించాలి

ప్రజాశక్తి - బాపట్ల

పదో తరగతి ఫెయిలైన విద్యార్థులు 2024 మార్చి, ఏప్రిల్‌లో జరుగే పరీక్షలకు హాజరయ్యేందుకు ఈనెల 10లోపు ఫీజు చెల్లించాలని డిఇఒ పివిజె రామారావు ఆదివారం తెలిపారు. ఫీజు చెల్లింపు గడువు ముగిశాక ఈ అక్టోబరు 11నుండి 15లోపు రూ.50అపరాధ రుసుంతో చెల్లించవచ్చన్నారు. 16నుండి 23వరకు రూ.200, ఈనెల 24నుండి 30వరకు రూ.5వందల అపరాధ రుసుంతో చెల్లించవచ్చని తెలిపారు. 3సబ్జెక్టుల వరకు పరీక్ష ఫీజు రూ.110కాగా అంతకు మించిన సబ్జెక్టులకు పరీక్ష ఫీజు రూ.125 చెల్లించాలని తెలిపారు. మైగ్రేషన్ సర్టిఫికెట్ కావాలంటే అదనంగా రూ.80 చెల్లించాలన్నారు. పరీక్ష ఫీజును bse.ap.gov.in website ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. సిఎఫ్ఎంఎస్ ద్వారా గాని, బ్యాంక్ ఛలానాలు చెల్లుబాటు కావని తెలిపారు. ప్రత్యేకంగా ప్రధానోపాధ్యాయులు ఫెయిలైన పదోతరగతి విద్యార్థులతో పరీక్ష ఫీజు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. రెగ్యులర్ విద్యార్థుల బోధనపై దృష్టిపెట్టాలని అన్నారు.



రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువకులు

రోటరీ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక భవనం వీరారెడ్డి రోటరీ భవనం నందు రక్త దానం శిబిరం ఆదివారం నిర్వహించారు. శిభిరాన్ని క్లబ్ అధ్యక్షులు నాగబైరు శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చీరాల గవర్నమెంట్ ఆసుపత్రి డాక్టర్ వి రాజ సెల్వన్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. ఆరోగ్యవంతులైన 60సంవత్సరాలలోపు వ్యక్తులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. శిబిరానికి రక్త దానం చేసే దాతలను ప్రోత్సహించేందుకు రోటేరియన్ కోటా శ్రీనివాసరావు చేసిన కృషిని రోటరీ సభ్యులు ప్రశంసించారు. 45మంది వివిధ గ్రామాల నుంచి వచ్చి రక్త దానం చేశారు. మహిళలు కూడ రక్త దానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, పాబోలు ఉదయభాస్కర్, గడ్డిపాటి శ్రీనివాసరావు, రావి సత్య నారాయణ, కొల్లా నరేంద్ర కుమార్, తెళ్ల రమేష్, చంద్ర, దండా శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, తోకల కృష్ణమోహన్, ల్యాబ్ టెక్నీషియన్ ఇ తిరుమలరావు, బి సుధీర్, సామాజికవేత్తలు అన్నంరాజు సుబ్బారావు, సిహెచ్‌వి రాంప్రసాద్ పాల్గొన్నారు.

నీరిచ్చి రైతులను ఆదుకోవాలి

రైతుసంఘం డిమాండ్

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

తీవ్రవర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలకు నాగార్జున్ సాగర్ నీరిచ్చి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం బాపట్ల జిల్లా కమిటి సభ్యులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు కోరారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులవల్ల సాగర్ ఏరియాల్లో కూడా ఈ ఏడాది ఖరీఫ్ సాగు సాగలేదన్నారు. మెట్ట ప్రాంతాలలో ఖరీఫ్ పంట ఎండిపోయిందన్నారు. రబీలో ఏ పంటలూ పండవని అన్నారు. సాగర్ కాలువ కింద ఆరుతడిగా రెండు లేదా మూడు తడులకైనా నీరిచ్చి మిర్చి, మొక్కజొన్న, బర్లీ పొగాకు లాంటి పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మెట్ట ప్రాంతాల్లో సాగుచేసి నష్టపోయిన రైతులకు వాతావరణ భీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సాగర్ నీటిని ఆరుతడి పంటలకు విడుదల చేయాలని కోరారు. నవంబరు తర్వాత సాగునీరిచ్చే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే రైతులు ఆందోళన చేయాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించారు.

డాక్టర్ అశోక్‌రెడ్డికి ఘన సన్మానం



డాక్టర్ అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా బత్తుల అశోక్ కుమార్‌రెడ్డిని వైసిపి నాయకులు ఘనంగా సత్కరించారు. అశోక్‌రెడ్డిని సన్మానించిన వారిలో వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు శీలం రాము చుక్కా కిరణ్‌కుమార్, రాపూరి ప్రభావతి చిమటా శ్రీను, చొప్పర వెంకన్న, పాకల రోశయ్య, కె. శంకర్‌రెడ్డి, కొక్కిలిగడ్డ హనుమంతరావు, సుదర్శి వెంకట్రావు, షేక్.అల్లాబక్షు, షేక్.మాభాష, షేక్ మొన్న, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, రాజకీయ నాయకులు, జిల్లా వైద్యులు ఉన్నారు.

నకిలీ దస్తావేజులు సృష్టిస్తున్న వారిని శిక్షించాలి

సిపిఎం నగర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నకిలీ వీలునామాలు, దస్తావేజులు సష్టించి భూములు, ఆస్తులు కొట్టేస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం ఒంగోలు నగర కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ మాట్లాడుతూ నకిలీ వీలునామాలు, దస్తావేజులు సష్టించి భూములు ఖరీదైన ఆస్తులను కొందరు కొట్టేస్తున్నారుని, హక్కుదారుడు వస్తే బెదిరించి లేకపోతే కోర్టుకు వెళ్లి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ దండా వెనుక ఎవరు ఉన్నారో సమగ్ర విచారణ జరిపి తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనలో కొందరు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన అధికారులు, డాక్యు మెంట్ రైటర్లు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నా యన్నారు. . వీరిపై కూడా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, నగరంలో టిడ్కో ఇళ్ళు లబ్ధిదారులకు ఇవ్వాలని, ఇళ్ళ స్థలాల సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. నగరంలో విష జ్వరాలు. కండ్ల కలకలు వస్తున్నాయని, జగనన్న సురక్ష పేరుతో ప్రచారం కాకుండా మిగతా వ్యాధులను అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు తంబి శ్రీనివాసులు, ఎస్‌డి హుస్సేన్, టి మహేష్, అత్తింటి శ్రీనివాసులు కొమ్మా శ్యామ్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న నగర కార్యదర్శి జి.రమేష్

శాంతిభద్రతలను పరిరక్షించాలి : ఎస్‌పి



మాబ్ డ్రిల్ లో శిక్షణ పొందుతున్న పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పోలీసు సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షిం చాలని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ కోరారు. అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీస ుకొచ్చేందుకు, జిల్లాలోని పోలీస్ సిబ్బందిని నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు పోలీస్ అధికారులు జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో మాబ్ ఆపరేషన్ డ్రిల్ గురించి శిక్షణ ఇచ్చారు. ఏవైనా సమస్యలు తలెత్తినపుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొడానికి, సమస్యను అదుపులోనికి తీసుకు వచ్చే విధంగా ప్రతి ఒక్క పోలీసు నిరంతరం అప్రమత్తంగా ఉండేవిధంగా, సమస్యలు తలెత్తినపుడు జన సముహాన్ని నివారించేందుకు ఏ విధమైన సమయస్ఫూర్తితో వ్యవహరించాలనే అనే అంశాలపై పోలీసు సిబ్బందికి మాబ్ ఆపరేషన్ డ్రిల్‌ను నిర్వహించారు. స్టోన్ గాడ్, హెల్మెట్, లాఠీ, మైక్, టియర్ గ్యాస్ ఆయుధం మొదలైన ఇతర పరికరాలు ఏ విధంగా ఉపయోగించాలి, భాష్పవాయువు ప్రయోగాలను ఏలాంటి సందర్భాల్లో అనుసరించాలి, లాఠీఛార్జ్ ఏ సమయంలో చేయాలి, ఏవిధంగా చెయ్యాలి అను విషయాలపై మాబ్ ఆపరేషన్ డ్రిల్ లో పోలీస్ సిబ్బందికి వివరించారు, ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగేందుకు అవకాశం ఉన్న సందర్భాలలో సమయ స్ఫూర్తిగా వ్యవహరించి వాటి అదుపు చేయడం కీలకమన్నారు. పోలీస్ సిబ్బంది అవాంఛనీయ సంఘటనలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి మాబ్ ఆపరేషన్ డ్రిల్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. మాబ్ ఎలా ప్రవర్తిస్తారు, వారిని ఎలా అదుపు చేయాలి, వారికి ఎటువంటి సూచనలు ఇవ్వాలి అనే విషయాల పై, మాబ్ ను చెదరగొట్టేటప్పుడు టియర్ గ్యాస్ ఎలా ప్రయోగించాలి, రబ్బరు బుల్లెట్లను ఎలా ప్రయోగించాలి, లాటీని ఎలా ఉపయోగించాలి, సమూహాలను చెదరగొట్టే క్రమంలో ఆందోళనకారులు లేదా పోలీసు సిబ్బంది గాయపడితే ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవాలి అనే విషయాల గురించి పోలీస్ సిబ్బందికి ఇచ్చారు.

వంగడాల రూపకల్పనలో 'బాపట్ల' కు అగ్రస్థానం

- బిపిటి వరి వంగడాన్ని రూపొందించిన వ్యవసాయ పరిశోధన స్థానం
- మూడున్నర దశాబ్దాలుగా విరాజిల్లుతున్న వరి వంగడం..
- తాజాగా నల్లబియ్యం, ఎర్ర బియ్యంపై పరిశోధనలు
- బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కృష్ణవేణి



ప్రజాశక్తి బాపట్ల

పోషకాలు మెండుగా ఉండే అద్భుత వంగడాల రూపకల్పనలో బాపట్ల వ్యవసాయ పరిశోధన అగ్ర స్థానంలో నిలిచి భారతదేశంలోనే అగ్రగామిగా ఖ్యాతి గడించింది. ఇదివరకే బిపిటి వంగడాన్ని రూపొందించిన బాపట్ల పరిశోధన స్థానం తాజాగా ఎర్ర బియ్యం, నల్ల బియ్యం రకాలను సిఫార్సు చేసి వ్యవసాయ రంగంలో వినూత్న విప్లవానికి శ్రీకారం చుట్టింది. ఇక్కడ సాధిస్తున్న ఫలితాలపై బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త బి .కష్ణవేణి ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆమె మాట్లాల్లోనే....

విలువైన పోషకాలు మెండుగా ఉండే నల్ల బియ్యం,ఎర్ర బియ్యం వంగడాలపై బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం విశేషమైన పరిశోధనలు చేస్తోంది. ఇప్పటికే ప్రపంచ స్థాయిలో అనేక వరి వంగడాలను రూపకల్పన చేస్తున్న ఈ కేంద్రం తాజాగా నల్లబియ్యం, ఎర్ర బియ్యం పై మరో కొత్త వంగడాలను సిఫార్సు చేసింది. బాపట్ల లోని వ్యవసాయ వరి పరిశోధనా స్థానం రైతులకు అద్భుతమైన వంగడాలను అందించేందుకు రూపకల్పన చేస్తోంది. దశాబ్దాల తరబడి ఈ కేంద్రం అందిస్తున్న వంగడాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఇప్పటివరకు పది రకాల వంగడాలను భారతదేశానికి బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం పరిచయం చేసింది. తాజాగా బిపిటిసి 2841 పేరుతో బ్లాక్ రైస్ వంగడాన్ని విడుదల చేసింది .బ్లాక్ రైస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. అత్యధికమైన పోషకాలు అందించడమే కాకుండా, షుగర్ వ్యాధి గ్రస్తులకు ఈ రకం బియ్యం మంచి ఆరోగ్యాన్ని అందిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.290 నుంచి రూ. 330 రూపాయలకు నల్ల బియ్యాన్ని విక్రయి స్తున్నారు. ఆరోగ్య వంతమైన, చీడపీడలను తట్టుకునే సామర్థ్యం కలిగిన ఈ నల్ల బియ్యం వరిరకం పంట కాలం 130 రోజులు. ప్రస్తుతం ఈ బ్లాక్ రైస్ వంగడాన్ని మినీ కిట్ల ద్వారా రైతులకు అందజేస్తున్నారు. రాష్ట్రంలో అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలు మినహా మిగిలిన పది జిల్లాల్లో ఈ బ్లాక్ రైస్ పండించటానికి అనువుగా ఉంది.నల్ల బియ్యంలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు ఆరోగా ్యనికి మేలు చేస్తాయన్న ఉద్దేశంతో వాటికి ఆదరణ పెరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో నల్లధాన్యం సాగు క్రమంగా విస్తరిస్తోంది. దేశవాళీ వరి వంగడాల సాగులో దిగుబడులు తక్కువగా ఉండటం, పైరు ఎక్కువ ఎత్తు పెరిగి ప్రకతి వైపరీత్యాలకు పడిపోవడం, ధాన్యం ముతకగా, లావుగా ఉండటం, అమైలోజ్ స్థాయిలు తక్కువగా ఉండటం వల్ల బియ్యాన్ని ఉడికించినప్పుడు అన్నం ముద్దలాగా మారుతుంది. అందువల్ల రోజూ ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోలేం. ఈ ప్రతికూలతలను అధిగమిస్తూ బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం నూతన వంగడం బిపిటి 2841ని అందుబాటులోకి తెచ్చింది.

ఈశాన్య భారతంలో నల్ల వరి సంకరం

ఈశాన్య భారతదేశంలోని దేశవాళీ నల్ల బియ్యం వంగడాలను రాష్ట్రంలో సాగు చేస్తున్న సన్నరకం వరి విత్తనాలతో సంకరం చేసి కొత్త విత్తనాన్ని అభివద్ధి చేశారు. కొత్త వంగడం ధాన్యం సన్నగా ఉండటంతోపాటు నల్లధాన్యంలో పోషక విలువలు అధికంగా ఉన్నాయి. బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం అభివద్ధి చేసిన వంగడాన్ని చిరుసంచుల ద్వారా రెండు వ్యవసాయ సీజన్లకు రైతులకు అందించారు.

తెలంగాణ,కర్ణాటక రాష్ట్రాల్లో నల్ల వరి సాగు..

రాష్ట్రంలోని పది జిల్లాలతోపాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో నల్ల వరి విత్తనాలు సాగు చేస్తున్నారు. ఇందులో ఆశించిన ఫలితాలు రావడంతో రైతుల నుంచి ఈ విత్తనాలకు

ముఖాముఖి

డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది మరికొంత మందికి చిరు సంచుల్లో విత్తనాలు సరఫరా చేయడానికి పరిశోధనా స్థానం ప్రణాళిక సిద్ధం చేసింది. దిగుబడులు ఆశాజనకంగా ఉండటం, తుపాన్లను తట్టుకుని నిలబడటం, నల్లధాన్యంలో పోషకాల శాతం అధికంగా ఉండటంతో సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

బియ్యం పొర నలుపు రంగులో ఉంటుంది.

బియ్యం పై పొర నలుపురంగులో ఉంటుంది. బియ్యానికి పైపొరలలోని నలుపు రంగు ఆంథోసైనిన్ అనే పదార్థం వల్ల వస్తుంది. సాధారణంగా మనం రోజూ ఆహారంగా తీసుకునే వరి రకాలతో పోల్చినప్పుడు నలుపు, ఊదా, ఎరుపు రంగు పైపొరగా కలిగిన వరి రకాలలో పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ పరిమాణంలో ఉంటాయి. నల ్లబియ్యం పైపొరలలో ఉండే ఆంథో ైనినిన్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, సూపర్ ఫుడ్‌గా పిలిచే బ్లూబెర్రీస్, బ్లాక్ బెర్రీస్‌తో ఉండే యాంటీ ఆక్సిడెంట్లతో సమానమైన పోషక విలువలు ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది.

యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఆహార పదార్థాలు..

యాంటీఆక్సిడెంట్ యాక్టివిటీ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థా లను ఆహారంగా తీసుకున్నప్పుడు అవి శరీరంలో ఉత్పత్తి అయిన ఫ్రీరాడికల్స్‌ను సమతుల్యం చేస్తాయి. అందువల్ల కేన్సర్, గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం వంటి దీర్ఘకాలిక రుగ్మతలను ఎదుర్కొనే శక్తి ఈ బియ్యం ఆహారంగా తీసుకున్న వారిలో ఉంటుంది. దీని పంటకాలం 130 నుంచి 140 రోజులు.పైరు సుమారు 110 సెంటీమీటర్ల ఎత్తు పెరుగుతుంది. దోమ,అగ్గి తెగులును తట్టుకుంటుంది.

ధాన్యం సన్నగా ఉంటాయి.

ధాన్యం సన్నగా ఉంటుంది. వెయ్యి గింజల బరువు సుమారు 14 నుంచి 14.5 గ్రాములు ఉంటుంది. రబీ, ఖరీఫ్ రెండు సీజన్లలో అన్ని రకాల భూముల్లో సాగు చేసుకోవచ్చు. ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుంది.ఆర్గానిక్ సాగు కింద పండించు కోవడానికి అనుకూలంగా ఉంటుంది. ధాన్యాన్ని 2శాతం పాలిష్ చేసుకుంటే సాధారణ బియ్యం ఉడికించినంత సమయంలో అన్నం సిద్ధమవుతుంది.

ట్రిపుల్ బెడ్‌రూం మోడల్ హౌస్ ప్రారంభం



మనుమడితో కలిసి మోడల్ హౌస్‌ను ప్రారంభిస్తున్న బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలుసబర్బన్

ఒంగోలు నగర కార్పొరేషన్ పరిధిలోని వెంగమొక్కలపాలెం సమీపంలో శ్రీకరి డెవలపర్స్ ఆదర్యంలో నూతనంగా నిర్మించిన ట్రిపుల్ బెడ్ రూమ్‌ల మోడల్ హౌస్‌ను మాజీ మంత్రి, ఒంగోలు ఏమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైసిపి యువ నాయకుడు బాలినేని ప్రణీత్ రెడ్డి కుమారుడు సిద్ధాన్ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం పారంభించారు. తొలుత బాలినేనికి శ్రీకరి మేనేజింగ్ డైరెక్టర్స్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీకరి సంస్థ అధినేత కె.భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఎ39.50 సెంట్లలో 209 విల్లాలు, 3 బెడ్ రూమ్,4బెడ్ రూమ్,5 బెడ్ రూంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. . ఆంధ్రప్రదేశ్ లో ఇలాంటి మోడల్ విల్లా ఎక్కడ లేదని ఫస్ట్ టైం ఒంగోలులో మోడల్ హౌస్ నిర్మించినట్లు తెలిపారు. ఇక్కడ క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పుల్, పార్క్ వాకింగ్ ట్రాక్, కిడ్స్ ప్లే పార్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జరిగిందన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో 209 విల్లాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఫస్ట్ ఫేజ్ కింద 109 విల్లాలు పూర్తి పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ మొత్తం ప్రాజెక్ట్ 2024 మార్చి నాటికి పూర్తి చేస్తామని భాస్కర్‌రెడ్డి తెలిపారు.